## క్లుప్తంగా

### వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

**బొమ్మనహాళ్:** మండలం కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామివారికి ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. సాయంత్రం ఆలయ ఆవరణలో గోపూజ, విశ్వక్సేనపూజ, పూణ్యాహవచనం, భక్తులకు కంకణధారణ, అంకురార్పణ, స్వామి వారి ధ్వజారోహణ, మంగళహారతి ,ప్రసాద వినియోగాలు నిర్వహించారు. అనంతరం బుధవారం సూర్యప్రభ, చంద్రప్రభ వాహనంపై ఉత్సవమూర్తిని ఊరేగించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

### గ్రాడ్యుయేషన్ డే



పి.నారాయణపురంలో గ్రాడ్యుయేషన్‌డేలో పాల్గొన్న ఎంఈఓ-2 సాయికృష్ణ

**కూడేరు:** మండలంలోని పి.నారాయణపురంలోని ప్రైమరీ స్కూల్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే జరుపుకున్నారు. ముఖ్య అతిథిగా ఎంఈఓ-2 సాయికృష్ణ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్లు పూర్తి చేసుకున్న పిల్లలు ప్రైమరీ స్కూల్‌లో ఒకటో తరగతిలో ప్రవేశం పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమణ ప్రసాద్, ఉపాధ్యాయులు మానస దేవి, నారాయణ , జిలాన్ బాషా, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

### హామీల అమలులో కూటమి విఫలం



కరపత్రాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

**రాయదుర్గంటౌన్:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొ్రటేష్ విమర్శించారు. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో యువజన హక్కులు, మార్పు కోసం మే 15న తిరుపతిలో నిర్వహించనున్న జాతీయ 17వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం పట్టణంలో పోస్టర్లు విడుదల చేసి, కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు నాగయ్య, శంకర్, కుమార్, నరేంద్ర, తేజ, చరణ్ పాల్గొన్నారు.

### ఉదిరిపికొండలో తాగునీటికి అవస్థలు



శివరాంపేట వద్ద ఏటిలో నుంచి ట్రాక్టర్‌తో నీరు తెచ్చుకుంటున్న దృశ్యం

**కూడేరు:** మండలంలోని ఉదిరిపికొండలో ఐదు రోజులుగా తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. గ్రామంలో మొత్తం 2 వేల వరకు జనాభా ఉంది. నీటి సరఫరా కోసం పంచాయతీ తరఫున ఏర్పాటు చేసిన బోరుమోటారు మరమ్మతుకు గురైంది. మరోవైపు ఉరవకొండ తాగునీటి ప్రాజెక్ట్ నుంచి నీరు సరఫరా కాలేదు. గ్రామస్తులు పక్క గ్రామమైన శివరాంపేట వద్ద వెళ్తున్న ఏటి వద్దకు వెళ్లి ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలు, సైకిళ్లలో నీరు తెచ్చుకుంటున్నారు.

### నివాళి



నివాళులర్పిస్తున్న మెట్టు గోవిందరెడ్డి

**రాయదుర్గంటౌన్:** పట్టణంలోని పైతోటలో 20వ వార్డు కౌన్సిలర్ నాయకుల సంజీవప్ప సోదరుడు, వైఎస్సార్‌సీపీ కార్యకర్త నాగరాజు అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. పార్టీ నియోజకవర్గ సమన్వకర్త మెట్టు గోవిందరెడ్డి, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పైతోటకు వెళ్లి నాగరాజు మృతదేహం వద్ద నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ మేకల శ్రీనివాసులు, రాష్ట్ర చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొరాళ్ల శివకుమార్, కౌన్సిలర్లు, పొరాళ్ల గోవిందరాజులు, మంజునాథ, కోఆప్షన్ సభ్యుడు శ్రీనివాసులు, నాయకులు రామాంజనేయులు, పైతోట రఘు, నిజాముద్దీన్, తిమ్మరాజు పాల్గొన్నారు.

# మోక్షమెన్నడో?

మంత్రి పయ్యావుల కేశవ ప్రాతినిధ్యం వహించే కూడేరు మండలంలో అన్నదాతలు లోవోల్టేజీ సమస్యతో సతమతమవుతున్నారు. మండలంలో వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా కాక పంటలు సరిగా పండించుకోలేక అవస్థలు పడుతున్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో 132-33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరయ్యింది. అయితే సార్వత్రిక ఎన్నికలు రావడం.. ఎన్నికల కోడ్ ఉండడంతో పనులు ముందుకు సాగలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సబ్ స్టేషన్ నిర్మాణ పనులు ఒక్క అడుగూ ముందుకు పడలేదు. అధికారులు కేవలం స్థల పరిశీలనతోనే సరిపెట్టారు. విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటైతే పంటలు పండించుకోవచ్చని రైతులు ఎదురుచూస్తున్నారు.

- 132-33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటులో కాలయాపన
- స్థల పరిశీలనతోనే సరిపెట్టిన అధికారులు
- 2023లో విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరు
- లోఓల్టేజీతో రైతుల అవస్థలు



కూడేరు: 2023 అక్టోబర్ 17న చోళసముద్రం పరిసరాల్లో స్థలాన్ని పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో ఈఈ శ్రీధర్ (ఫైల్)



కూడేరు: 2025 ఏప్రిల్ 12న చోళసముద్రం వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ కేశవ నాయుడు (ఫైల్)

**కూడేరు:** మండల వ్యాప్తంగా వ్యవసాయ సర్వీసులు 7,443 ఉన్నాయి. ప్రస్తుతం వ్యవసాయానికి ఏడు గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తున్నారు. అందులో పగటి వేళ నాలుగు గంటలు. రాత్రి వేళ మూడు గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తున్నారు.

**లోఓల్టేజీ సమస్యకు చెక్..**

కూడేరు మండలంలో 132-33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేస్తే కూడేరు, బుక్కరాయసముద్రం, అనంతపురం రూరల్, ఆత్మకూరు, కళ్యాణదుర్గంతో పాటు మరికొన్ని మండలాల్లో లోఓల్టేజీ సమస్య తీరుతుంది. వ్యవసాయానికి అంతరాయం లేని విద్యుత్ సరఫరా అయితే పంటలు పండించుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. రెవెన్యూ ,ట్రాన్స్‌కో అధికారులు చొరవ తీసుకొని త్వరితగతిన విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

**సార్వత్రిక ఎన్నికలతో బ్రేక్..**

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కూడేరు మండలంలోని రైతులు పంటలు పండించుకోవడానికి నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలన్న ఉద్దేశంతో 2023 సెప్టెంబర్ నెలలో 132-33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరు చేశారు. ఏపీ ట్రాన్స్‌కో నిధులు రూ. 20 కోట్లు కేటాయించారు. అక్టోబర్ 17న ట్రాన్స్‌కో ఈఈ శ్రీధర్ కూడేరు మండల పరిధిలోని చోళసముద్రం పరిసర ప్రాంతాల్లో సబ్ స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన కూడా చేశారు. చోళసముద్రం పరిసరాల్లో స్థల పరిశీలన చేస్తున్న తరుణంలో సార్వత్రిక ఎన్నికలు సమీపించడంతో ఆ ప్రక్రియ ఆగిపోయింది. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యింది. ఆతర్వాత సుమారు ఆరు నెలల పాటు విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు ఊసే లేదు. లోఓల్టేజీతో విద్యుత్ సరఫరా కావడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

**జనవరి నుంచి మళ్లీ స్థల పరిశీలన..**

2025 జనవరి 23న అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు కోసం మళ్లీ అనువైన స్థల పరిశీలనకు చోళసముద్రం గ్రామ పరిసరాల్లో పర్యటించారు. ఎల్‌పీ నంబర్ 1062, 1063లోని 7.45 ఎకరాల భూమిని మండల రెవెన్యూ అధికారులు ఆయనకు చూపించారు. ఆ స్థలం సబ్ స్టేషన్ నిర్మాణానికి అనువుగా ఉంటుందా లేదా ? అని ఆర్డీఓ క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ నెల 12న ఆర్డీఓ చోళసముద్రంలో మరో మారు పరిశీలన చేసి వదిలేశారు.

### స్థలం కేటాయిస్తే టెండర్ ఆహ్వానం



విద్యుత్ సబ్‌స్టేషన్‌కు అనువైన స్థలాన్ని పరిశీలించి రెవెన్యూ అధికారులు స్థలాన్ని కేటాయిస్తే వెంటనే నోటిఫికేషన్ జారీ చేసి టెండర్లకు ఆహ్వానిస్తాం. స్థల కేటాయింపు విషయమై ట్రాన్స్‌కో అధికారులు రెవెన్యూ అధికారులతో చర్చిస్తున్నారు. త్వరలోనే స్థల కేటాయింపు ఓ కొలిక్కి వస్తుంది. విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటైతే లోఓల్టేజీ లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి అవకాశం ఉంటుంది. – శేషాద్రి శేఖర్, విద్యుత్ శాఖ ఎస్ఈ

### 15 లోపు స్థలం కేటాయిస్తాం



చోళసముద్రం పరిసర ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇప్పటికే రెండుసార్లు స్థల పరిశీలన చేశాం. ఎల్‌పీ నంబర్ 1062, 1063లోని 7 ఎకరాలా 45 సెంట్ల స్థలాన్ని ఎంపిక చేశాం. ఆ భూమి సేకరణకు సంబంధించి రైతులతో చర్చించాం. రైతులు కూడా భూములు ఇవ్వడానికి అంగీకారం తెలిపారు. వచ్చే నెల 15 లోపు స్థలాన్ని ట్రాన్స్ కో అధికారులకు అప్పగిస్తాం. – కేశవనాయుడు, అనంతపురం ఆర్డీఓ

### లోఓల్టేజీతో విద్యుత్ సరఫరా



నాకు పదెకరాల పొలం ఉంది. వరి, వేరుశనగ, ఇతర ప్రత్యామ్నాయ పంటలు సాగు చేస్తాం. అయితే లోఓల్టేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్నాం. దీంతో మోటర్లు సక్రమంగా పని చేయడం లేదు. 132-33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేస్తే నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుంది. అధికారులు చొరవ చూపి త్వరగా విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి. – ఎర్రిస్వామి, రైతు, ముద్దలాపురం, కూడేరు మండలం

## అధైర్య పడకండి.. అండగా ఉంటాం



మాట్లాడుతున్న మెట్టు గోవిందరెడ్డి

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త 'మెట్టు'

**బొమ్మనహాళ్:** కూటమి ప్రభుత్వం ఎన్ని అక్రమ కేసులు బనాయించినా అధైర్య పడొద్దని, అండగా ఉంటానని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి భరోసా కల్పించారు. మంగళవారం ఉద్దేహాళ్ గ్రామంలో జరిగిన పెద్దమ్మ దేవి, మారెమ్మ దేవి దేవరలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ నాయకులపై తప్పుడు కేసులు బనాయిస్తోందన్నారు. ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి కుటిల రాజకీయాలు చేస్తున్నట్లు విమర్శించారు. కూటమి ప్రభుత్వం ప్రజల్లో నమ్మకాన్ని కోల్పోతోందన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో పథకాలన్నీ అన్ని వర్గాలకూ వర్తించేవని గుర్తు చేశారు. ఎన్నికల ముందు అమలు గాని హామీలిచ్చి, ఇప్పుడు ఏ ఒక్క హామీని నెరవేర్చిన దాఖలాలు లేవని అన్నారు. వైఎస్సార్‌సీపీ కోసం అహర్నిశలు అంకిత భావంతో పని చేసేవారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రామాంజనేయులు, నాయకులు ప్రసాద్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, పయ్యావుల సత్యన్న, పరమేశ్వర, కోటేశ్వరరెడ్డి, వన్నూరుస్వామి, సూర్యప్రతాప్‌రెడ్డి, డాక్టర్ బసప్ప, రంగారెడ్డి, మోహన్‌రెడ్డి, రామకృష్ణ, వెంకట్‌రెడ్డి, చిదానంద, తిప్పేస్వామి, రవి, అంజిరెడ్డి, మురళీ మోహన్‌రెడ్డి, నాగిరెడ్డి, కేశవరెడ్డి, దేవన్న, వెంకటేష్, మోహన్ బాబు, రవి, మారుతి పాల్గొన్నారు.

**వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ట**

**డి హీరేహాళ్(రాయదుర్గం):** డి హీరేహాళ్ మండలంలోని తిమ్మాలాపురం ఆంజనేయస్వామి ఆలయంలో నూతన విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మంగళవారం జరిగింది. వేకువజామున వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక హోమాలు గంగ, గౌరీ పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. తిమ్మాలాపురం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రణయ్‌రెడ్డి జన్మదిన వేడుకలు



ఉరవకొండలోని పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

**ఉరవకొండ:** నియోజకవర్గ వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాయలసీమ జిల్లాల జోనల్ చైర్మన్ వై.ప్రణయ్‌రెడ్డి జన్మదిన వేడుకలు పార్టీ శ్రేణులు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ప్రజా ప్రతినిధులు, నాయకుల ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. అనంతరం పేదలకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కూడేరు, బెళుగుప్ప, విడపనకల్లు, వజ్రకరూరు మండలాల్లోనూ యూత్ నాయకులు, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు వేడుకలు జరిపారు. కార్యక్రమంలో ఎంపీపీ నరసింహులు, వైస్ ఎంపీపీ ఈడిగప్రసాద్, పార్టీ రాష్ట్ర నాయకులు మాజీ ఎంపీపీ ఏసీ ఎర్రిస్వామి, బసవరాజు, పార్టీ మండల, రూరల్ సమన్వయకర్తలు ఓబన్న, ఎర్రిస్వామిరెడ్డి, మాజీ కురుబ, ఎంబీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు గోవిందు, జోగి వెంకటేష్, సర్పంచ్ మల్లెల జగదీష్, సుద్దాల వెంకటేష్, పచ్చిరవి, ఆలిమినేని అనిల్, పచ్చిరవి, వజ్రకరూర్ కన్వీనర్ సోమశేఖర్‌రెడ్డి, కురుబ ప్రకాష్, అంగదాల అంజి, జోగి భీమా, జోగి హనుమంతు, చిన్నా, మైనార్టీ నాయకులు బళ్లారి ఆసీఫ్, శర్మాస్, మైనుద్దీన్, గురికాల ఓబుళేసు, బసవరాజు, గాజుల తేజ, రాయల్‌మల్లి, చిన్న భీమ, విశ్రాంత ఉపాధ్యాయులు ఎర్రిస్వామి పాల్గొన్నారు.

## నూర్‌బాషా దూదేకుల సంఘం కమిటీ ఎంపిక




నూర్‌బాషా దూదేకుల సంఘం నూతన కమిటీ సభ్యులు వీరే

**ఉరవకొండ:** నూర్‌బాషా మహమ్మద్ దూదేకుల సంక్షేమ సంఘాన్ని ఎంపిక చేశారు. మంగళవారం స్థానిక హజరత్ బీబీ జైనబీ్బ అమ్మవారి దర్గా ఆవరణలో నూర్‌బాషా మహమ్మద్ దూదేకుల సంక్షేమ సంఘం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశం అనంతరం నూతన సంఘాన్ని ఎంపిక చేశారు. అధ్యక్షులుగా డి.తాయుబ్, గౌరవ అధ్యక్షుడిగా డి.అబ్దుల్ కరీం, ఉపాధ్యక్షులుగా టైలర్ శర్మాస్, చర్మాల శర్మాస్, ప్రధాన కార్యదర్శులుగా దాదా ఖలందర్, బాషా, బాబు, కోశాధికారిగా సిద్ధయ్య, కార్యదర్శులుగా ఖాశీం, జాఫర్, అహ్మద్, ప్రచార కార్యదర్శిగా దస్తగిరి నియమితులయ్యారు. ఈసందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ నూర్‌బాషా దూదేకుల సంఘం ఆధ్వర్యంలో దూదేకుల హక్కుల సాధన కోసం పోరాడుతామన్నారు.

**బొమ్మనహాళ్ మండల అధ్యక్షుడిగా ఇస్మాయిల్**

**బొమ్మనహాళ్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూర్ బాషా సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా పింజారి ఇస్మాయిల్ ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల ఉపాధ్యక్షుడిగా పింజారి దాదాఖలందర్, ప్రధాన కార్యదర్శిగా పింజారి షేకన్నను ఎంపిక చేసినట్లు తెలిపారు. తనను ఎంపిక చేసిన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సయ్యద్ బాజీ, సంఘం నాయకులకు పింజారి ఇస్మాయిల్ కృతజ్ఞతలు తెలియజేశారు. దూదేకుల కులస్తుల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

## ప్రభుత్వ సేవలను సక్రమంగా నమోదు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రాజేష్

**కళ్యాణదుర్గం రూరల్:** ప్రభుత్వ సేవలను సక్రమంగా నమోదు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ డిప్యూటీ ఏఎస్‌ఓ నాగేంద్ర ప్రసాద్, ప్రోగ్రాం ఆఫీసర్ రాజేష్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలోని హెల్త్ సెంటర్‌లో డివిజన్ పరిధిలోని పీహెచ్‌సీ వైద్య సిబ్బందికి కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ లెవెల్ హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం (హెచ్‌ఎంఐఎస్ ఫార్మాట్ అండ్ ఆర్‌సీహెచ్ పోర్టల్)లో ఆయా ప్రభుత్వాస్పత్రుల్లో అందిస్తున్న సేవలను నమోదు చేయడంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయ డిప్యూటీ ఏఎస్‌వో నాగేంద్ర ప్రసాద్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ తప్పులకు తావులేకుండా సేవలను హెచ్‌ఎంఐఎస్‌లో కచ్చితత్వంతో నమోదు చేసే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో కళ్యాణదుర్గం డివిజన్ పరిధిలోని రాయదుర్గం, కణేకల్ గుమ్మగట్ట, డీహీరేహాళ్, బొమ్మనహాళ్, బెళుగుప్ప, శెట్టూరు, కుందుర్పి, కంబదూరు, బ్రహ్మసముద్రం, పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు ద్విచక్ర వాహనాల వేలం

**బెళుగుప్ప:** మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ నేరాలలో పట్టుబడిన ద్విచక్రవాహనాలు బుధవారం బహిరంగ వేలం వేయనున్నట్లు ఎస్‌ఐ శివ ఓ ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనదలిచిన వారు రూ.1000 రుసుం చెల్లించాలన్నారు.

## పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలి

**కళ్యాణదుర్గం రూరల్:** గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని సీడీపీఓ లక్ష్మీప్రసన్న తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సీడీపీఓ లక్ష్మీప్రసన్న, డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌లో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం ఎండలు మండుతున్నాయని, వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సూపర్‌వైజర్లు భారతి, ఓబులమ్మ, అరుణ, సుధా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

**సీసీ రోడ్డు, డ్రైనేజీ ఏర్పాటు చేయండి**

**రాయదుర్గంటౌన్:** పట్టణంలోని శాంతినగర్‌లో వెలసిన ఆధ్యాత్మిక ప్రచార సేవాశ్రమం వద్ద సీసీ రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని నిర్వాహకులు కోరారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్పను కలిసి వినతిపత్రం అందజేశారు.

**త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం**

**బొమ్మనహాళ్:** మండల కేంద్రంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై మంగళవారం ప్రచారం చేశారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఉరవకొండ కమిటీ అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడారు. త్రైత సిద్ధాంత సమితి సభ్యులు సురేష్, విష్ణు, వెంకటేష్, యల్లమ్మ, సుజాత, జ్యోతి, చందు, సుమతి, అనిత, సువర్ణ పాల్గొన్నారు.

**ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి**

**కళ్యాణదుర్గం రూరల్:** మండల పరిధిలోని కొత్తూరుకు చెందిన మంజునాథ్ (45) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మంజునాథ్ ఇటీవల మోరేపల్లి సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య సావిత్రమ్మ, కొడుకు, కూతురు ఉన్నారు.

**గుంతలోకి జారి పడిన ఉపాధి కూలీ**



ఉపాధి పనులు చేస్తూ ప్రమాదానికి గురయిన బోయ గోవిందు

**బెళుగుప్ప:** స్థానిక బీసీ కాలనీకి చెందిన బోయ గోవిందు మంగళవారం ఉపాధి పనులు చేస్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. తోటి కూలీలతో కలసి ఫారంపాండ్ పనులు చేస్తుండగా గట్టుపై నుంచి కిందకు జారిపడ్డాడు. దీంతో అతనికి కాలు విరిగింది. అతన్ని మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

**ఆటో నుంచి జారి పడి మహిళకు గాయాలు**

**రాయదుర్గంటౌన్:** పట్టణ శివారులో బళ్లారి రహదారిపై ఆటోలో నుంచి హనుమక్క అనే మహిళ జారిపడి తీవ్రంగా గాయపడింది. హనుమక్క మంగళవారం సాయంత్రం మురడి గ్రామం నుంచి ప్యాసింజర్ ఆటోలో వెళ్తుండగా ప్రమాదవశాత్తూ జారి పడింది. తలకు బలమైన గాయాలు కావడంతో స్థానిక ఏరియా ఆస్పత్రి నుంచి మెరుగైన చికిత్స కోసం బళ్లారి విమ్స్‌కు తరలించారు.

**కృష్ణాపురంలో యువకుడి మృతి**

**బొమ్మనహాళ్:** మండలంలోని కృష్ణాపురానికి చెందిన ఎర్రిస్వామి అనే యువకుడు బళ్లారి విమ్స్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందిన్నట్లు ఎస్‌ఐ నబీరసూల్ తెలిపారు. కృష్ణాపురానికి చెందిన ఎర్రిస్వామి, లేపాక్షి, లాలుస్వామి సోమవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై ఉప్పరహాళ్‌క్రాస్ నుంచి కృష్ణాపురం వెళ్తూ ప్రమాదానికి గురయ్యారు. ఎర్రిస్వామికి తీవ్ర గాయాలు కావడంతో బళ్లారి విమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందిన్నట్లు తెలిపారు.

### సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

**కూడేరు:** మండలానికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు 9 యూనిట్లు మంజూరైనట్లు ఎంపీడీఓ కుళ్లాయిస్వామి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జల్లిపల్లి ఏపీజీబీ పరిధిలో 2, కూడేరులోని ఏపీజీబీ పరిధిలో 3 యూనిట్లు, పెనకచెర్ల కెనరా బ్యాంక్ పరిధిలో 1, కూడేరు ఎస్‌బీఐ పరిధిలో 3 యూనిట్లు మంజూరయ్యాయి. అర్హులు మే 10లోపు దరఖాస్తు చేసుకుకోవాలని ఎంపీడీఓ తెలిపారు.

### ప్రజలకు బాధ్యతతో సేవలు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

**కళ్యాణదుర్గం రూరల్:** సచివాలయాలకు వివిధ పనులపై వచ్చే ప్రజలకు బాధ్యతతో సేవలు అందించాలని డ్వామా పీడీ సలీంబాషా అధికారులకు సూచించారు. మంగళవారం కంబదూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ, పీ-4 సర్వే, పింఛన్ల మొత్తం జమ అంశాలపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ గూడెన్న అధ్యక్షత నిర్వహించిన సమావేశంలో డివిజనల్ అభివృద్ధి అధికారి నాగేశ్వరరావు హాజరయ్యారు. అనంతరం డ్వామా పీడీ మాట్లాడుతూ వివిధ అంశాలపై చేస్తున్న సర్వేలపై సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. క్షేత్రస్థాయిలో సర్వే సక్రమంగా జరిగితే లబ్ధిదారులకు మేలు చేకూరుతుందన్నారు. సర్వే పారదర్శకంగా చేపట్టాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. బాధ్యతగా విధులు నిర్వహించకపోతే చర్యలు తప్పవని సచివాలయ సిబ్బందిని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఓ తిప్పయ్య, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### భ్రూణ హత్యలు నేరం



సమావేశంలో మాట్లాడుతున్న హెల్త్ ఎడ్యుకేటర్ విజయభారతి

**కణేకల్లు:** భ్రూణహత్యలు చట్టరీత్యా నేరమని గరుడచేడు పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ విజయభారతి తెలిపారు. మంగళవారం మండలంలోని నాగేపల్లి గ్రామంలో భ్రూణ హత్యలపై అవగాహన కార్యక్రమం జరిగింది. హెల్త్ ఎడ్యుకేటర్ మాట్లాడుతూ లింగ పరీక్షలు చేయించుకోవడం నేరమన్నారు. కొందరు పిండదశలోనే హత్య చేస్తున్నారన్నారు. బాల్య వివాహాలు చేయకుండా ఆడ పిల్లలను ఉన్నతంగా చదివించాలని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ వెంకట సుబ్బమ్మ, శ్రీనివాస్, ఏఎన్‌ఎం లక్ష్మీదేవి, ఆశా వర్కర్ మాణిక్యమ్మ పాల్గొన్నారు.

### వజ్రకరూరు సర్పంచుకు ప్రశంసాపత్రం



పంచాయతీరాజ్ కమిషనర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న వజ్రకరూరు సర్పంచ్ మోనాలిసా

**ఉరవకొండ (వజ్రకరూరు) :** విజయవాడలో పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ చేతుల మీదుగా వజ్రకరూరు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ మోనాలిసా మంగళవారం ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. అనంతపురం జిల్లా నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఫౌండేషన్ ఫర్ ఎకాలజీ సెక్యూరిటీ వారి ఆధ్వర్యంలో సహజ వనరుల సారధుల లీడర్స్ ఫర్ కామన్స్ అనే కార్యక్రమం కింద ఎంపిక అయి విజయవాడలో తొమ్మిది వారాల పాటు శిక్షణ పొందారు. గ్రామీణ ప్రాంతాల్లో సహజ వనరులపైన వాటి ఉపయోగాలు, బాలికల విద్య, గిరిజనుల మౌలిక వసతులపైన సర్పంచ్ ఉపన్యసించారు. శిక్షణ విజయవంతంగా పూర్తి చేయడంతో ఆమెకు పంచాయతీరాజ్ కమిషనర్ ప్రశంసా పత్రాన్ని అందించారు. సర్పంచ్ మాట్లాడుతూ తనకు ఇంత గొప్ప వేదిక మీద శిక్షణ పొంది, తమ ప్రాంత ప్రజల స్థితిగతులను వివరించే అవకాశం కల్పించినందుకు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.